అంతు లేని.. నిరీక్షణ



పింఛన్ల దరఖాస్తులు చూపుతున్న లబ్ధిదారులు

- కొత్త పింఛన్ల ఎక్కడంటున్న లబ్ధిదారులు
- ఏడు నెలలైనా మంజూరు కాని వైనం
- కూటమి ప్రభుత్వంపై మండి పడుతున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు

అల్లిపురం:

కొత్త పింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు నెలల తరబడి ఆశగా ఎదురు చూస్తున్నారు. సంక్రాంతికి ఇస్తామని చెప్పినప్పటికీ కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. దీంతో వృద్ధులు, వితంతువులు మండిపడుతున్నారు. వీరిలో చాలా మందికి ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛన్లే ఆధారం. ఒకటో తేదీ కోసం వీరంతా ఆశగా ఎదురు చూస్తుంటారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు పూర్తయినా కనీసం దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం లేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు.

నవంబర్‌లో కొత్త జీవో..

కూటమి ప్రభుత్వం నవంబర్‌లో కొత్త జీవో తీసుకొచ్చింది. నవంబర్ ఒకటి నుంచి 15వ తేదీలోగా పింఛన్ అందుకుంటున్న భర్త చనిపోతే మరుసటి నెల నుంచి భార్యకు పింఛన్ అందజేయాలని జీవోలో పేర్కొంది. 15 నుంచి 31వ తేదీ లోగా చనిపోతే నెల విడిచి మరో నెలలో పింఛన్ అందజేయాలని ఆ జీవోలో పేర్కొంది. ఈ నిర్ణయంతో చాలా మంది అర్హులు పింఛన్లకు దూరమయ్యారు.

60 ఏళ్లు దాటిన వారిదీ అదే పరిస్థితి..

60 ఏళ్లు దాటిన వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దక్షిణ నియోజకవర్గం 14 వార్డుల్లో 60 ఏళ్లు దాటిన వారు సుమారు వెయ్యి మందికి పైగా ఉన్నారు. అలాగే భర్తలను కోల్పోయిన వితంతువులు సైతం 150 నుంచి 200 మందికి పైగా ఉన్నారు. 2024 డిసెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి సంక్రాంతికి కొత్త పింఛన్లు ఇస్తామని ప్రజా ప్రతినిధులు ప్రకటనలు గుప్పించారు. దీంతో సంక్రాంతికి కొత్త పింఛన్లు అందుతాయని ఆశగా ఎదురు చూసిన వారికి ఎదురు చూపులే మిగిలాయి.

50 ఏళ్లు దాటిన వారికి ఎప్పుడో?

వెనుకబడిన తరగతులకు చెందిన 50 ఏళ్లు పూర్తయిన వారికి పింఛన్లు అందజేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు దాటినా దీని గురించి కనీస ప్రస్తావన లేకపోవడంతో అర్హులు సర్కారు తీరును తప్పుబడుతున్నారు.

పింఛన్ మంజూరు కాలేదు



నా భర్త డిసెంబర్‌లో చనిపోయారు. దరఖాస్తు చేసుకున్నా పింఛన్ రాలేదు. ఇంటికి పెద్ద దిక్కుని కోల్పోయిన నాకు జీవనం ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం నుంచి వితంతు పింఛను వస్తుందని ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. పింఛన్ వస్తేనే బతకగలం.

– పసుపురెడ్డి లక్ష్మి, బంగారుమెట్ట, అల్లిపురం

దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు



ఒంటరి మహిళగా గత ఎన్నికలకు ముందు దరఖాస్తు చేసుకున్నాను. ఎన్నికల కోడ్ వల్ల నా దరఖాస్తు పరిశీలించలేదు. ఎన్నికలు అయిన తర్వాత కొత్త ప్రభుత్వం వచ్చినా ఇంకా పింఛన్ మంజూరు కాలేదు. ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నాను. ప్రభుత్వం స్పందించి పింఛన్ మంజూరు చేయాలి.

– భీశెట్టి పద్మ, బంగారుమెట్ట, అల్లిపురం

నిర్లక్ష్యం తగదు..



నాకు 60 ఏళ్లు పైబడ్డాయి. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయం చుట్టూ తిరుగుతున్నాను. కొత్త దరఖాస్తులు తీసుకోవడం లేదు. ఇంకా ఎటువంటి ఆదేశాలు రాలేదంటున్నారు. గతంలో వలంటీర్లు ఉండేవారు ప్రతి పని చేసేవారు. ఇప్పుడు వారు లేరు. ప్రభుత్వం మాలాంటి వారికి సహాయం చేయాలి.

– లంక లక్ష్మి, వెంకటేశ్వరమెట్ట, అల్లిపురం

కొత్త పింఛన్ల ఊసే లేదు..



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో 50 ఏళ్లు పైబడిన వారికి పింఛన్ ఇస్తానని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా కొత్త పింఛన్ల ఊసే లేదు. మాలాంటి అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు దరఖాస్తు పెట్టిన వెంటనే పింఛను మంజూరు అయ్యేది.

– పి.అప్పారావు,అమ్మవారివీధి,అల్లిపురం

క్లుప్తంగా

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాలక్ష్మి వ్రతం



అనఘాలక్ష్మి వ్రతంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: వివేకానందకాలనీలోని అనఘాలక్ష్మి, వారాహి, రాజశ్యామల సహిత షిర్డీ సాయి దర్బార్‌లో శనివారం అనఘాలక్ష్మి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జయలక్ష్మీ మాతా మాతృమండలి, చింతామణి గణపతి దత్త క్షేత్రం, సాయి మేరు ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వ్రతంలో దాదాపు 300 మంది పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్యామల అమ్మవారిని, అనఘాలక్ష్మీ అమ్మవారిని, వారాహి మాతను విశేషంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.


ఆకట్టుకున్న ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ పాట



జీవీఎంసీ గాంధీ పార్కులో గీతాలు ఆలపిస్తున్న ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ

సీతమ్మధార: 'ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ పాట, సంఘమిత్ర సూరిబాబు మాట' పేరిట జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమం ఆలోచింపజేసింది. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోకపోతే వచ్చే పరిణామాలను వివరిస్తూ దేవిశ్రీ పలు గీతాలు ఆలపించి చైతన్య పరిచారు. పాలకుల వైఖరిని ఎండగట్టారు. మూడు రోజుల అవగాహన ఉద్యమంలో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ప్రభుత్వ సంస్థల్లో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా సంఘ మిత్ర సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. ఆఖరి రోజు కార్యక్రమానికి బ్రహ్మకుమారి రమ, ఏయూ విశ్రాంత ఆచార్యులు సూరప్పుడు అతిథులుగా హాజరయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణతో తీవ్ర పరిమాణాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని సంఘమిత్ర సూరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతిని అంతం చేస్తేనే పురోగతి సాధ్యమని చెప్పారు.

బల్లిగిరి వెంకన్నకు ప్రత్యేక పూజలు



అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం దేవాలయంలో అన్నమయ్య శ్రీ వేంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఊరంతా అన్నమయ్య–ఇంటింట అన్నమయ్య కార్యక్రమంలో భాగంగా మహిళల కోలాటం భక్తులను విశేషంగా అలరించింది. స్వామివారికి ఆలయ అర్చకుడు ఏకహారతి మొదలు నక్షత్ర హారతి, కుంభహారతి ఇచ్చారు.

కేజీహెచ్ ఆక్సిజన్ ప్లాంట్ వద్ద పటిష్ట భద్రత



కేజీహెచ్‌లో ఆక్సిజన్ ప్లాంట్ పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ శివానంద్ తదితరులు

మహారాణిపేట: కేజీహెచ్ ఆక్సిజన్ ప్లాంట్ వద్ద ఎటువంటి ఇబ్బంది లేకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ తెలిపారు. ఇటీవల ఆక్సిజన్ ప్లాంట్ వద్ద ఉన్న పైపులను కొంత మంది వ్యక్తులు కోసిన సంగతి తెలిసిందే. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత సీఎస్ఆర్ బ్లాక్ వద్ద ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ పరిసరాలను తనిఖీ చేశారు. అక్కడ పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టారు. ఆక్సిజన్ ప్లాంట్ల వద్ద ఆస్పత్రికి సంబంధించిన సెక్యూరిటీని 24 గంటలు ఉండే విధంగా పటిష్టం చేస్తున్నామన్నారు. రాత్రి సమయంలో మరింత మంది సెక్యూరిటీ గార్డులను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ శివానంద్ తెలిపారు.

ఎల్‌బీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ కన్నుమూత



రవీంద్రబాబు

దాబాగార్డెన్స్: ప్రముఖ న్యాయవాది, మానవతావాది, ఎల్‌బీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ లింగం భోగేశ్వరరావు, ఝాన్సీరాణిల పెద్ద కుమారుడు ఎల్‌బీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ లింగం రవీంద్రబాబు శుక్రవారం అర్ధరాత్రి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. పక్షం రోజులుగా తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతున్న ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన భౌతిక కాయాన్ని శనివారం విజయనగరం తీసుకెళ్లారు. ఆదివారం రోటరీ స్వర్గధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన భార్య లింగం పద్మ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో మెరుగైన సమాజం



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రజా రవాణా శాఖాధికారి అప్పలనాయుడు

దాబాగార్డెన్స్: జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి బి. అప్పలనాయుడు ఆధ్వర్యంలో శనివారం ద్వారకా బస్ స్టేషన్‌లో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. పలువురు ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, కార్యాలయ ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది, క్లీనింగ్ సిబ్బందిచే స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో మెరుగైన సమాజం సొంతమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాల్గొని తడి, పొడి చెత్త వేరు చేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడంలో భాగంగా ప్రతి ఒక్కరూ గుడ్డ లేదా నార సంచులు మాత్రమే వాడాలని కోరారు. అనంతరం బస్ కాంప్లెక్స్, కార్యాలయంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి. సత్యనారాయణ, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీబీఎంకే రాజు, పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, అకౌంట్స్ ఆఫీసర్ వి. వంశీ మోహిని, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) ఎన్. బాపిరాజు, చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మోహన్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ జి. శ్రీధర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



కార్యాలయ ఆవరణను చీపురుతో శుభ్రం చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, రీజనల్ డైరెక్టర్ రాధారాణి

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మూడో శనివారం సందర్భంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణి కార్యాలయ ఆవరణను చీపురుతో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం పరిసరాల పరిశుభ్రతకు కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యాలయం లోపల, వెలుపల మొక్కలు ఏర్పాటు చేసి సంరక్షించాలని సూచించారు. తడి, పొడి, ప్రమాదకర చెత్త సేకరణకు గ్రీన్, రెడ్ బ్లూ డస్ట్ బిన్లు ఉపయోగించాలన్నారు. ఇళ్లు, దుకాణాలు, పాఠశాలలు, సంస్థలు తదితర ప్రదేశాల్లో ఏర్పడే చెత్తను 3 రకాలుగా వేరు చేసేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొని తమ తమ సెక్షన్లను, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు.

అటకెక్కిన కూటమి హామీలు

- వాసుపల్లి గణేష్‌కుమార్



వాసుపల్లిని కలిసిన గరికిన చంద్రశేఖర్, పద్మనాభం అమ్మాజీ తదితరులు

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం వస్తుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల తన కార్యాలయంలో శనివారం నూతనంగా నియమితులైన పార్టీ దక్షిణ నియోజకవర్గ వికలాంగుల విభాగం అధ్యక్షుడు గరికిన చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పద్మనాభం అమ్మాజీ వాసుపల్లిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వాసుపల్లి చొరవతో జిల్లా నాయకులు, పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ గత తప్పిదాలు సరి చేసుకుంటూ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారన్నారు. కూటమి పాలన ఎన్నికల ముందు చెప్పింది ఒకటి.. చేస్తోంది ఒకటని ఎద్దేవా చేశారు. అధికారం కోసం చేతకాని హామీలిచ్చి చంద్రబాబు మరోసారి తన వక్రబుద్ధి ప్రదర్శించుకున్నారని ఆరోపించారు. సంక్షేమాన్ని అటకెక్కించారని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ఉండి ఉంటే కోట్లాది రూపాయల సంక్షేమం ప్రజలకు అందేదని, అక్క చెల్లెమ్మలు, నిరుద్యోగులు, మత్స్యకారులకు మచ్చుకైనా భరోసా కనిపించడం లేదన్నారు. ప్రజలు కోరుకునే విధంగా మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ, పలు వార్డుల నాయకులు అలపన కనకరెడ్డి, భీశెట్టి ప్రసాద్, దశమంతుల చిన్ని, రెయ్యి దేవీద్‌రాజు, మళ్ల బుజ్జి, గంగాధర్, అజయ్, గనకల రామరాజు, చింతకాయల వాసు, చేపల రాజు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో స్వచ్ఛాంధ్ర



ఆస్పత్రిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న డాక్టర్ శివానంద్ తదితరులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఇతర వైద్యులు చీపురు పట్టి శుభ్రం చేశారు. పలు విభాగాల్లో తడి, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేసి తరలించారు. అనంతరం ఆస్పత్రిలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెంటెంట్ డాక్టర్ జి.వాసవీలత, అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ, సివిల్ సర్జన్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మోహన్ కుమార్, ఆర్ఎంవీ డాక్టర్ దవళ భాస్కరరావు, స్వచ్ఛాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ డి. రాజేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న శానిటరీ సిబ్బంది, వార్డు సెక్రటరీలు

స్వచ్ఛాంధ్రపై అవగాహన..

దాబాగార్డెన్స్: స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 30వ వార్డు తాడివీధిలో శనివారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్త సేకరణపై స్థానికులకు అవగాహన కల్పించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు సెక్రటరీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

బాబోయ్ దుర్గంధం



కాలువలో పేరుకుపోయిన మురుగు, చెత్త

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 38వ వార్డు యాసిన్ బాబా దర్గా వద్ద మురుగు కాలువ దుర్గంధ భరితంగా మారింది. గత కొద్ది రోజులుగా చెత్తా చెదారాలు పేరుకు పోవడంతో మురుగు నీటి ప్రవాహం నిలిచిపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోయింది. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై వార్డు పారిశుధ్య సిబ్బందికి తెలిపినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఘనంగా ప్రపంచ కంప్యూటర్ దినోత్సవం



అరుణపద్మను సత్కరిస్తున్న ఆదిత్య డిగ్రీ కళాశాల యాజమాన్యం

దాబాగార్డెన్స్: దాబాగార్డెన్స్‌లో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం ఐటీ బజ్–2025 ప్రపంచ కంప్యూటర్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, ప్రజెంటేషన్లు, క్విజ్ వంటి పోటీలు నిర్వహించారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి అరుణపద్మ పాల్గొని సాంకేతిక రంగ ప్రాముఖ్యత, కొత్త స్కిల్స్, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆదిత్య డిగ్రీ కళాశాలల ఉత్తరాంధ్ర డైరెక్టర్ పి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్‌పై పట్టు సాధించడం ద్వారా మంచి ఉద్యోగావకాశాలు పొందవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కడారి కుమార్, చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌వీ బాబ్జి, కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ జీవీఎన్ శాస్త్రి, ఎన్. త్రిమూర్తులు, ఎం. తనీల్ మోహన్, సీహెచ్ జగన్నాథం, కె. సుప్రియ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం లొల్లి..



శిలాఫలకం తొలగించిన తర్వాత..



గత నెల 22న ఎమ్మెల్యే వంశీకృష్ణ, వేదాంత కంపెనీ ప్రతినిధులు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం (ఫైల్)

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధి 39వ వార్డు ఎంవీడీఎం హైస్కూల్లో రూ.4 లక్షల వ్యయంతో వేదాంత కంపెనీ సోలార్ ప్యానెల్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా గత నెల 22న ప్రారంభింపజేశారు. శిలాఫలకంపై స్థానిక ఎమ్మెల్యే పేరుతో పాటు వేదాంత గ్రూప్ సీఈవో సతీష్‌కుమార్ పేరు పెట్టారు. ఆ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. ఈ విషయంపై సాక్షి ఆరా తీయగా.. ఆ శిలాఫలకంపై స్థానిక కార్పొరేటర్ పేరు లేదని కొంత మంది వచ్చి ఆ శిలాఫలకాన్ని తొలగించారని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ పేరు లేకపోతే ఎలా? కార్పొరేటర్ పేరు పెట్టిన శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలంటూ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆ శిలాఫలకాన్ని తొలగించారని సాక్షికి దృష్టికి తీసుకొచ్చారు. ఈ పంచాయతీ వన్‌టౌన్ స్టేషన్‌కు పాకింది. శిలాఫలకం తొలగింపుపై పలువురు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినట్టు తెలిసింది. అలాగే ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు సమాచారం. ప్రస్తుతానికి ఆ శిలాఫలకాన్ని లోపల పడేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కార్పొరేట్ సెక్టార్స్ వివిధ ప్రభుత్వ పాఠశాలలు..హాస్పటల్స్..మురికివాడ ప్రాంతాల అభివృద్ధికి తమ వంతు భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అందుకు వారి అనుమతితోనే చేసిన సహకారం..చేపట్టిన అభివృద్ధి పనులకు గుర్తింపుగా శిలాఫలకం ఏర్పాటు చేసుకుంటారు. ఆ శిలాఫలకంలో ఎవరైతే సహాయం/అభివృద్ధి చేస్తున్నారో వారి పేర్లు/కంపెనీ పేర్లతో పాటు ఎవరిచే ప్రారంభోత్సవం చేయిస్తారో వారి పేర్లు పెట్టడం సహజం. అక్కడకు కట చేస్తే..



మూలకు చేరిన శిలాఫలకం

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం నివేదించారు. 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం విశేష హారతి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

20 విజయవాడలో మీటర్ రీడర్స్ సంఘం మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అల్లిపురం: ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ సంఘం (ఏఐటీయూసీ) అనుబంధ రాష్ట్ర మొదటి మహాసభలు ఈ నెల 20వ తేదీన విజయవాడలో జరగనున్నట్లు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు తెలిపారు. శనివారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న మీటర్లను తొలగించి స్మార్ట్ మీటర్లు ప్రవేశపెడుతున్న సందర్భంగా విద్యుత్ మీటర్ రీడర్లు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వీరిని తక్షణమే ప్రభుత్వం ఈపీడీసీఎల్, ఇతర విభాగాల్లో ఉద్యోగ అవకాశం కల్పించి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా 15 వందల మంది హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, విశాఖ జిల్లా విద్యుత్ మీటర్ రీడర్స్ సంఘం ప్రతినిధులు ఎల్. రామకృష్ణ, కె. శివారెడ్డి, డి.క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.